# ఓయూలో రాహుల్‌గాంధీ చిత్రపటం దహనం




రాహుల్ గాంధీ చిత్రపటాన్ని దహనం చేస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో విద్యారంగంపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ చిత్రపటాన్ని దహనం చేశారు. ఓయూ పరిపాలన భవనం ఎదుట నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థి నాయకులు మాట్లాడుతూ తమ భూములను వేలం వేయకూడదని హెచ్సీయూ విద్యార్థులు, అధ్యాపకులు శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే వారిపై లాఠీచార్జి చేయడమేంటని ప్రశ్నించారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఎటువంటి ఆందోళనలు చేయకూడదంటూ అధికారులు సర్క్యులర్ జారీ చేయడాన్ని ఖండించారు. ఈ అంశంపై రాహుల్ గాంధీ తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. నోరెత్తితే రాజ్యాంగం అంటూ మాట్లాడే రాహుల్‌కు ఇప్పుడు నోరెందుకు రావడంలేదని ఎద్దేవా చేశారు. ఇందిరాగాంధీ ప్రారంభించిన యూనివర్సిటీ భూములను ఆ పార్టీకి చెందిన సీఎం లాక్కుంటూ, అడ్డుకుంటున్న విద్యార్థులపై పోలీసులచే పాశవికంగా దాడి చేపిస్తున్నారని వాపోయారు.

## ఎమ్మెల్యే తలసానికి శుభాకాంక్షలు

బేగంపేట్/అమీర్పేట్, ఏప్రిల్ 2:మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు పలువురు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన పలువురు ముస్లింలు బుధవారం వెస్ట్‌మారేడ్ పల్లిలోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే తలసానిని కలిసి శాలువాలతో సత్కరించి రంజాన్ ప్రత్యేక వంటకం షీర్ కుర్మాను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని తనను కలిసిన ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బేగంపేట డివిజన్ పార్టీ గడ్డ బస్తీ అధ్యక్షుడు శేఖర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో అక్బర్, నసీం భాను, విజయలక్ష్మి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు శ్రీహరి ఆధ్వర్యంలో ఓల్డ్ కస్టం బస్తీకి చెందిన ఆరిఫ్, సాబీర్ అలీ, నవాబ్, అశ్వక్, అజీజ్, సనత్‌నగర్‌కు చెందిన నోమాన్, సికిందర్, ఉస్మాన్, ఫహీం తదితరులు ఉన్నారు. సనత్‌నగర్ జామా మసీద్ విస్తరణ పనులకు సంబంధించి జరుగుతున్న నిర్మాణాలను ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యే తలసాని కలిసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో మీర్జా సమీర్ బేగ్, సలీం ఖాన్, మహ్మద్ ఉస్మాన్, సయ్యద్ ఫయామ్, సీనియర్ జర్నలిస్ట్ సికింద్రాబాద్ తదితరులున్నారు.

## ముగిసిన పదవ తరగతి పరీక్షలు



పరీక్షా కేంద్రం నుంచి బయటికి వచ్చి సంతోషం వ్యక్తం చేస్తున్న విద్యార్థినులు

కవాడిగూడ, ఏప్రిల్ 2: పదవ తరగతి పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. ముషీరాబాద్ విద్యామండలి పరిధిలో మార్చి 21వ తేదీన ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు బుధవారం ముగియడంతో విద్యార్థులు ఆనందంగా పరీక్ష కేంద్రాల నుంచి బయటికి రావడం కనిపించింది. ముషీరాబాద్ మండల పరిధిలో మొత్తం 4,807 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టడంతో విజయవంతంగా పరీక్షలు రాశారని ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ డీఈఓ శ్రావణ్‌కుమార్ తెలిపారు.

## అయోధ్యకాండపై చిన్నారులకు అవగాహన



అవగాహన శిబిరంలో చిన్నారులు

అమీర్‌పేట్, ఏప్రిల్ 2: సనాతన ధర్మ బాల సంస్కరణ సమితి ఆధ్వర్యంలో శ్రీరామ నవమి సందర్భంగా జరుగుతున్న నవరాత్రుల వేడుకల్లో భాగంగా బుధవారం సాయంత్రం బాలబాలికలకు 'అయోధ్య కాండ' గురించి వక్తలు వివరించారు. 'సంస్కృతి' మోడల్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో కొనసాగుతున్న ఈ కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు ఆధ్యాత్మిక, నైతిక విలువలు, సామాజిక బాధ్యత అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. సనాతన ధర్మబాల సంస్కరణ సమితి సభ్యులు బుచ్చిబాబు, హారిక, పావని, సత్యనారాయణ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కార్యక్రమాలపై చిన్నారుల తల్లిదండ్రులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

## హంసధ్వని సంగీత పరిశోధనా అంశాలపై 12న శిక్షణా శిబిరం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అసిస్టెంట్ ప్రొ. డా. పావని, సమితి అధ్యక్షుడు విజయకుమార్ తదితరులు

చిక్కడపల్లి, ఏప్రిల్ 2:సుప్రసిద్ధ సాంస్కృతిక సంస్థ నవ్య నాటక సమితి ఆధ్వర్యంలో 'హంసధ్వని' సంగీత పరిశోధన అంశాల రూపకల్పనలో శిక్షణా శిబిరం ఈ నెల 12న నిర్వహింపబడుతుందని సమితి అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్, సమన్వయకర్తలు నిష్ఠల సుధామాల, డాక్టర్ ఇందిరా హేమలు తెలిపారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను బుధవారం చిక్కడపల్లిలోని సమితి కార్యాలయంలో ప్రముఖ సంగీత విద్వాంసురాలు, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం సంగీత విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. పావని దుడ్డు, సమితి సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ శిబిరంలో సంగీత పరిశోధనా రంగంలో కొత్తగా అడుగుపెట్టిన విద్యార్థులు, అధ్యాపకులు, ఆసక్తిగల పరిశోధకులకు విశ్లేషణాత్మక ఆలోచన, సరైన శోధనా అంశాల ఎంపిక, పరిశోధనా విధానాలు, సమాచార సేకరణ విధానాలు వంటి అంశాలపై ప్రాముఖ్యతనిచ్చి వివరంగా అవగాహన కల్పిస్తామని తెలిపారు.

## చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలను వేయించాలి



చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్న వైద్యులు

కవాడిగూడ, ఏప్రిల్ 2:అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదు ఏండ్ల లోపు పిల్లలకు వ్యాధినిరోధక టీకాలను తప్పనిసరిగా వేయించాలని ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ) వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌రెడ్డి సూచించారు. ఐదు ఏండ్ల లోపు చిన్నారులకు 12 రకాల వ్యాధుల నుంచి రక్షణ కల్పించే టీకాలను ముషీరాబాద్ యూపీహెచ్‌సీలో బుధవారం ఉచితంగా వేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌రెడ్డి మాట్లాడుతూ.. చిన్నారులు ఎలాంటి వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు వారికి తప్పనిసరిగా టీకాలు వేయించాలని చెప్పారు. కార్యక్రమంలో ఆసుపత్రి పీహెచ్ఎన్ పెల్లీస్, ఏఎన్ఎం విజయకుమారి, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతలు కాపాడటంలో ప్రభుత్వం విఫలం

బీఆర్ఎస్ గ్రేటర్ నేత ఎంఎన్ శ్రీనివాసరావు



ముషీరాబాద్, ఏప్రిల్ 2: శాంతిభద్రతలను కాపాడటంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, సీఎం నిర్వహిస్తున్న హోంశాఖ ఘోరంగా వైఫల్యం చెందిందని బీఆర్ఎస్ గ్రేటర్ నేత ఎంఎన్ శ్రీనివాసరావు ఆరోపించారు. హత్యలు, మానభంగాలు జరుగుతుంటే ప్రభుత్వ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని విమర్శించారు. సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నగర ఆడిబొడ్డున విదేశీ మహిళపై అత్యాచారం చేయడం, పూర్తిగా హోంశాఖ వైఫల్యంతోనే ఇదంతా జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం సొంత జిల్లా మహబూబ్‌నగర్‌లో మరో మహిళపై అత్యాచారం చేయడం దారుణమన్నారు. గడిచిన ప్రభుత్వం పైన నిందారోపనలు చేసుకుంటూ ప్రజల్ని మభ్యపెడుతున్నారని ఆరోపించారు. ఆచరణకు సాధ్యం కానీ వాగ్ధానాలు చేసి, ఎప్పటికప్పుడు ప్రజల దృష్టి మరల్చడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కొన్నిసార్లు ఫోన్ టాపింగ్ అని, మరికొన్నిసార్లు కాళేశ్వరం అని కల్లబొల్లి మాటలు చెబుతూ కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ముందుచూపు లేకపోవడం వల్లనే నగరంలో తాగునీటి కొరత సంభవిస్తుందని, కలుషిత నీటి సరఫరా జరుగుతుందని ఆరోపించారు.

## ప్రభుత్వం హెచ్‌సీయూ భూములు అమ్మాలని చూడటం దారుణం

బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జయసింహ




చిక్కడపల్లి, ఏప్రిల్2 : దేశ భవిష్యత్తు కోసం మేధావులను తయారు చేసి విశ్వవిద్యాలయాల భూములను ప్రభుత్వం అమ్ముకోవడం అత్యంత దారుణమని బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జయసింహ అన్నారు.బుధవారం గాంధీనగర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ప్రజా పాలన పేరుతో అధికారులకు వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రజలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. యూనివర్సిటీకి సంబంధించిన భూములను రక్షించుకోవడానికి హెచ్‌సీయూ యూనివర్సిటీ విద్యార్థులు చేస్తున్న నిరసన కార్యక్రమాలపై పోలీసులు లాఠీచార్జి చేయడం అత్యంత దుర్మార్గమన్నారు. విద్యాలయాలు, విశ్వవిద్యాలయాలు ప్రగతికి నిలయాలు. జీవ వైవిధ్యానికి నిలువైన హెచ్‌సీయూ భూములను జేసీబీలతో ధ్వంసం చేసి ప్రభుత్వం అమ్మాలని చూడటం దారుణమన్నారు. భూములను రక్షించడం కోసం విద్యార్థులు చేస్తున్న పోరాటంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాలకు అనుగుణంగా తాము ఈ ఉద్యమంలో ముందుంటామని తెలిపారు.

## సీతారామ కళ్యాణం కరపత్రం ఆవిష్కరణ

ముషీరాబాద్, ఏప్రిల్ 2: రాంనగర్ ఆర్యవైశ్య సంఘం, వాసవి కన్యకా పరమేశ్వరి ఫ్యామిలీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీతారామ కళ్యాణ మహోత్సవాలను మూడు రోజులపాటు నిర్వహించినట్లు సంఘం నేతలు తెలిపారు. ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను బుధవారం సంఘం అధ్యక్షుడు వెనిశెట్టి సుధాకర్ గుప్తా, సత్య వర్ధన్, చామల శ్రీనివాస్, ఎర్రం శ్రీనివాస్, రమేశ్ ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సంఘం సిల్వర్ జూబ్లీ ఉత్సవాల్లో భాగంగా మూడు రోజులపాటు 5,6,7 తేదీలలో స్వామివారి కల్యాణ వేడుకను నిర్వహించినట్లు తెలిపారు.

## పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టాలి



జంతర్‌మంతర్ వద్ద నిర్వహించిన బీసీ బిల్లుకు మద్దతు తెలుపుతున్న అగ్రికల్చర్ యూనివర్సిటీ బీసీ ఉద్యోగులు

వ్యవసాయ యూనివర్సిటీ : తెలంగాణ ప్రభుత్వం బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని అసెంబ్లీలో బిల్లు పెట్టినా, పార్లమెంట్లో బిల్లు పెట్టాలని డిమాండ్ చేస్తూ పార్లమెంటు సమావేశాలు రెండు రోజులు ఉండగానే బిల్లు పెట్టకపోవడంతో ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద బీసీల మహాధర్నా ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంఘాల అధ్యక్షులతో పాటు ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు. అగ్రికల్చర్ యూనివర్సిటీ బీసీ ఉద్యోగులు భిక్షపతి, అధ్యక్షులు కృష్ణ రజినీకాంత్ కె కిషన్ డాక్టర్ వెంకటేశ్వర్లు ఢిల్లీలోని జంతర్ మంతర్ ధర్నాలో పాల్గొన్నారు.

## 14 వరకు 'రాజీవ్ యువ వికాస్' దరఖాస్తులు

జూబ్లీహిల్స్,ఏప్రిల్ 2: యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాజీవ్ యువ వికాసం పథకంలో ఈ నెల 14 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు జీహెచ్ఎంసీ 19వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానా తెలిపారు. సర్కిల్‌లోని యూసుఫ్ గూడ, వెంగళరావునగర్, రహమత్ నగర్, బోరబండ, ఎర్రగడ్డ వార్డు కార్యాలయాల్లో రాజీవ్ యువ వికాసం హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు బుధవారం యూ సీడీ, డీపీఓ వెంకట కిషన్‌రావు ఆయా వార్డు కార్యాలయాల్లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ప్రారంభించారు. ఈ పథకానికి ఆన్‌లైన్ లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సంబంధిత పత్రాలను ఆయా వార్డు కార్యాలయాల్లో సమర్పించాలని వారు కోరారు. ఒకవేళ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయని వారు వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌లో నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని యూసీడీ డీపీఓ వెంకట కిషన్ రావు తెలిపారు.

## మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు రెండు పదవులివ్వాలి




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో త్వరలో జరగబోయే క్యాబినెట్ విస్తరణలో మాదిగలకు రెండు పదవులు కేటాయించాలని దక్షిణాది జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో సుమారు 42 లక్షల జనాభా కల్గిన మాదిగలకు ఒక్క మంత్రి పదవి కూడా కేటాయించకపోవడం దారుణం అన్నారు. తార్నాకలోని జేఏసీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. మాదిగలకు ఎంపీ, ఎమ్మెల్యే పదవుల్లో కాంగ్రెస్ పార్టీ అన్యాయం చేసిందని ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా మాలలకే అవకాశం ఇచ్చారని గుర్తు చేశారు. చివరకు మంత్రి వర్గంలో కూడా ఆరుగురు మాదిగ ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ ఒకరికి కూడా అవకాశం కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వర్గీకరణ చట్టం పేపర్లు మాదిగలకు, మంత్రి పదవులు, ఉద్యోగాలు మాలలకా అని ప్రశ్నించారు. ఇది ఇలాగే కొనసాగితే కాంగ్రెస్ మాలల పార్టీ అవుతుందన్నారు. తెలంగాణలో సింగిల్ మెజార్టీ కులమైన మాదిగల ఓట్లతోనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని గుర్తుంచుకోవాలని సూచించారు. అందుకే మాదిగలకు రెండు మంత్రి పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో మాదిగల సత్తా ఏమిటో కాంగ్రెస్ పార్టీకి రుచి చూపిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు వేల్పుల సంజయ్, దరువు రమేశ్, నాగరాజు, సత్యం, అంబేద్కర్, రవితేజ పాల్గొన్నారు.

## సాంస్కృతిక భీష్ముడు బిరుదు ప్రదానం




సాంస్కృతిక, సాహిత్య రంగాల్లో కృషి మానసిక తృప్తి ఇస్తుందనీ ఏపీ అధికార భాష సంఘం మాజీ అధ్యక్షుడు పి విజయబాబు అన్నారు. త్యాగరాయ గానసభలో వంశీ ఆర్ట్స్ థియేటర్స్ ఆధ్వర్యంలో జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ స్థాపకుడు గుదిబండి వెంకట రెడ్డి 84 ఏండ్ల జన్మదిన వేడుక జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన వెంకటరెడ్డిని సత్కరించి, సాంస్కృతిక భీష్ముడు బిరుదు ప్రదానం చేశారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం మాట్లాడుతూ.. వెంకటరెడ్డి రాష్ట్ర సచివాలయంలో ఉన్నత అధికారిగా పని చేసిన కాలం నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు సృజనాత్మకశక్తితో నిరంతరంగా నిర్వహిస్తూ మన్నన పొందారన్నారు. కార్యక్రమంలో సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు, దూరదర్శన్ విశ్రాంత పూర్వ డైరెక్టర్ డాక్టర్ మధుసూదనరావు, యువ కళావాహిని లంక లక్ష్మీనారాయణ, రాజ్య లక్ష్మికళ, రఫీ,కిన్నెర రఘురాం, సమైఖ్య భారతి సత్యనారాయణ, పొత్తూరి సుబ్బారావు, విజయ కుమార్, శ్రీనివాస్ రామరాజు, సమావేశ కర్త వంశీ రామరాజు, వీవీ రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. – ముషీరాబాద్, ఏప్రిల్ 2

## లాఠీఛార్జి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి



హిమాయత్ నగర్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న పుట్ట లక్ష్మణ్

హిమాయత్ నగర్, ఏప్రిల్2: హెచ్‌సీయూ భూముల వివాద ఘటనలో విద్యార్థులపై లాఠీఛార్జ్ చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం హిమాయత్‌నగర్, రాజ్‌బహదూర్ హాల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్టంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయ భూముల విషయంలో మొండిగా వ్యవహరిస్తున్నదని, ప్రభుత్వ భూములను కార్పొరేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నాన్ని విరమించుకోవాలన్నారు.శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇప్పటికే పలువురి విద్యార్థి నాయకులపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కి తరలించారని తెలిపారు.ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని కాపాడుతాం అంటూ ఒక వైపు చెబుతూ, మరోవైపు ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తుందని ఆరోపించారు.
యూనివర్సిటీ మొత్తం పోలీసుల వలయంలో చిక్కుకున్నదని, తక్షణమే పోలీస్ బలగాలను వెంటనే వెనక్కి పంపించాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు గ్యార క్రాంతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సామిడి వంశీ వర్ధన్ రెడ్డి,నేతలు అరుణ్, హరీష్, సందీప్, కృష్ణ, సాయి, వెంకటేష్, శ్రావణి, ఆకాశ్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే లక్ష్యం: ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

దుండిగల్, ఏప్రిల్ 2: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీ ఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శంభీపూర్ రాజు అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, శంభీపూర్ లోని కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీల ప్రజలు బుధవారం ఆయనను కలిశారు. పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో పాటు వాటిని పరిష్కరించాలని విన్నవించారు.

## శివాలయ పరిసరాల్లో రోడ్డు వేయాలి

బాలానగర్, ఏప్రిల్ 2 : ఫతేనగర్ డివిజన్, శివాలయం పరిసరాల్లో రోడ్డు వేయాలని కోరుతూ స్థానికులు బుధవారం కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. బుధవారం స్థానికుల కోరిక మేరకు శివాలయం రోడ్డులో కార్పొరేటర్ సతీశ్‌గౌడ్ పర్యటించి సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు వేయాలని స్థానికులు కోరారు. అనంతరం మాట్లాడుతూ..స్థానికుల విజ్ఞప్తి మేరకు శివాలయ పరిసరాల్లో రోడ్డు నిర్మించేందుకు కృషి చేస్తానన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డికి తగిన గుణపాఠం చెప్తాం

నందారం సీతారాం మాదిగ



మంద కృష్ణ మాదిగను కలిసిన ఎంఎస్‌పీ నాయకులు

సికింద్రాబాద్, ఏప్రిల్ 2: ఎస్సీ వర్గీకరణ సాధకుడు ఎమ్మార్పీఎస్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగను పలువురు నాయకులు కలుసుకున్నారు. ఎంఎస్‌పీ సీనియర్ నాయకుడు నందారం సీతారాం మాదిగ, మెట్టుగూడ ఆటో ప్రకాశ్ మాదిగలు ఎస్సీ వర్గీకరణ సాదకుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ పేరుతో మాదిగలకు మభ్యపెట్టి తీవ్రమైన అన్యాయం చేసిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై రాబోయే ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో మాదిగ ప్రజలు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని, మాలలకు ఉద్యోగాలు దోచిపెట్టిన రేవంత్ రెడ్డి మాదిగలకు మంత్రివర్గంలో స్థానం కల్పించకపోవడం మాదిగలపై రేవంత్ రెడ్డికి ఉన్న విపక్షత తేటతెల్లమైందని, రాబోయే ఎన్నకల్లో గుండు సున్నాకి పరిమితం చేసి మాదిగల సత్తా చాటుతామని సీతారాం మాదిగ హెచ్చరించారు.

## దేశవ్యాప్తంగా కుల గణన జరగాలి

చిక్కడపల్లి, ఏప్రిల్ 2 : దేశవ్యాప్తంగా కుల గణన జరగాలని, జనాభా దామాషా ప్రకారం ఎవరి వాటా వారికి రిజర్వేషన్ దక్కాలని వడ్డెర సంఘం తెలంగాణ లక్ష్య సాధన రాష్ట్ర అధ్యక్షులు, ట్రస్ట్ చైర్మన్ జెరిపేటి సత్యనారాయణ డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్స్ కల్పించాలని డిమాండ్ చేస్తూ దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ లో బీసీ సంఘాల ఆధ్వర్యంలో బీసీల పోరుగర్జన మహా ధర్నా జరిగింది. మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండ సురేఖ, రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్లతో సత్యనారాయణ, తెలంగాణ గన్ను దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు ఎత్తిరి అంతయ్య, మిగతా సంఘం నాయకులుమహా ధర్నాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ, అంతయ్య మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం బీసీలకు స్థానిక ఎన్నికల విద్య ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ అసెంబ్లీలో ఆమోదించిన కేంద్ర ప్రభుత్వం కూడా బిల్లును ఆమోదించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జెరిపేటి రాజు తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## చిట్టీల వ్యాపారి పుల్లయ్య నివాసం వద్ద ఉద్రిక్తం



పుల్లయ్య నివాసం వద్ద గుమికూడిన బాధితులు

అమీర్‌పేట్, ఏప్రిల్ 2 : ఎస్సార్ నగర్ పరిసరాల్లో చిట్టీ ఫైనాన్స్ వ్యాపారాలు చేసి వందలాది మందికి కోట్లాది రూపాయల మేరకు కుచ్చుటోపీ పెట్టి ఉడాయించిన పుల్లయ్యను బుధవారం సాయంత్రం సీసీఎస్ పోలీసులు బీకేగూడలోని ఆయన నివాసానికి విచారణ నిమిత్తం తీసుకువచ్చారు. పుల్లయ్యను బీకే గోడలోని నివాసానికి పోలీసులు తీసుకువస్తున్నట్లు సమాచారం అందుకున్న బాధితులు పెద్ద సంఖ్యలో ఆయన నివాసం వద్ద గూమిగూడారు. దీంతో పుల్లయ్య నివాస పరిసరాల్లో ఉద్రిక్తత నెలకొన్నది. సీసీఎస్ పోలీసులు భారీ బందోబస్తు మధ్య పుల్లయ్యను ఆయన నివాసానికి తీసుకువచ్చి విచారించారు. ఆగ్రహావేశాలతో ఉన్న బాధితులు పుల్లయ్యపై దాడి చేయవచ్చనే అనుమానంతో ఎస్సార్‌నగర్ పోలీసులు పుల్లయ్య నివాసం వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. సీసీఎస్ పోలీసులు తమ విచారణను ముగించిన తర్వాత పుల్లయ్యను సీసీఎస్‌కు తరలించారు.

## ఘనంగా సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి



సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు టింకుగౌడ్, టీఎన్ శ్రీనివాస్ గౌడ్

బొల్లారం, ఏప్రిల్ 2: తెలంగాణ వీరత్వం, పరాక్రమానికి సర్వాయి పాపన్న గౌడ్ ప్రతీకగా నిలిచారని బీఆర్ఎస్ యువ నాయకుడు టింకు గౌడ్ కొనియాడారు. బుధవారం కంటోన్మెంట్ న్యూ బోయిన్పల్లి లో సర్వాయి పాపన్న వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం టింకు గౌడ్ మాట్లాడుతూ.. ఆనాటి సమాజంలో నెలకొన్న నిరంకుశ రాజరిక పోకడలకు వ్యతిరేకంగా అన్ని వర్గాలను ఏకం చేసి పాపన్న పోరాడాడని పేర్కొన్నారు. అణిచివేత, వివక్షకు వ్యతిరేకంగా పాపన్న గౌడ్ ప్రదర్శించిన ఆత్మగౌరవ పోరాట స్ఫూర్తి నేడు అందరికీ ఆదర్శం అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు టింకు గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్ గౌడ్, అమర్ గౌడ్, దయానంద్ గౌడ్, పరమేశ్ గౌడ్, మురళి గౌడ్, సదానంద గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పూలే, అంబేద్కర్ జన జాతర

చిక్కడపల్లి, ఏప్రిల్ 2: కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో పూలే, అంబేద్కర్ జనజాతర కార్యక్రమాన్ని ఏప్రిల్ 2వ తేదీ నుంచి 31వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని, ఏప్రిల్ నెలలో మహనీయుల మాసంగా నిర్వహించడం జరుగుతుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు తెలిపారు. బాగ్లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శాస్త్రసాంకేతిక రంగం ఎంతో పురోభివృద్ధి చెందినప్పటికీ నేటికీ కుల వివక్షత కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేవీపీఎస్ ఆధ్వర్యంలో కుల వివక్షతపై ప్రతిఘటన పోరాటాలు చేస్తూ వస్తున్నామని తెలిపారు. పూలే, అంబేద్కర్ జన జాతరలో భాగంగా ఏప్రిల్ 1 నుంచి 10వ తేదీ వరకు గ్రామగ్రామాన కులవివక్షతపై అధ్యయనం చేస్తామని తెలిపారు. 11న పూలే జయంతి నుంచి 14 అంబేద్కర్ జయంతి వరకు పూలే, అంబేద్కర్ జన జాతర సభలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.దశరథ్, ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, నాయకులు కృపాసాగర్, కుంటి లక్ష్మణ్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**PUBLIC NOTICE**

All the general public hereby informed that my client B.chandra Mouli Son of B.Yadgiri age: 64, Occ: Business Residing at H.no. 95/A, maruthi Nagar jai Jawan Colony kapra Sec-bad dist-500062 is entering into Agreement of Sale CUM General Power Of Attorney with Possession.
With pertaining to a Open Plot located in Athvelli Sri Ragvendra Nagar colony Medchal Malkajgiri, Secunderbad-500010- by virtue of Sale Deed of late B.Bshwant Rao S/o late Babu Rao Age about 82, Occ: Business R/o Resala Bazar Bolarum Secunderabad entering into Agreement of Sale Cum General Power Of Attorney with Possession with his Sole daughter as his legal heir of her father property for the vide doc no 4147 of 1987 registered at the office of the Sub-registrar Ranga Reddy Dt 26-05-1987 a Open plot.
2 All or any person(s) any legal heirs of B.Bshwanth Rao S/o late Babu Rao claiming an interest in the Schedule Property or any part thereof by any manner i.e., sale, gift, lease, inheritance, exchange, mortgage, charge, lien, trust, possession, easement, attachment or otherwise howsoever are hereby required to bring it to the notice of undersigned with all the documentary proofs at my office T.Niteen Advocate situated at Shop no 5 Pulla Palli Balaiah Complex Beside Mee- Seva Vinayak Nagar Neredmet Ph 9246247819, within five (7) days from the date hereof, failing which my client will proceed to complete the Mutation, without any reference to such claim and the same, if any, shall be considered as waived.

**SCHEDULE PROPERTY**

Open Plot no 256 Sy no 245, 268, 269, 270, 271, 272, & 273, in site area admeasuring 266 square yards, vide doc no 4147 of 1987 registered at the office of the Sub-registrar Ranga Reddy Dt 26-05-1987

**T.Niteen, Advocate**
Shop no 5 Pulla Palli Balaiah Complex Beside Mee- Seva Vinayak Nagar Neredmet
Ph 9246247819